సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 9 । అక్టోబర్ । 2025



ఇదేనా.. స్వచ్ఛ మున్సిపాలిటీ?

భీమవరం మున్సిపాలిటీలో ఎక్కడ చెత్త అక్కడే ఉండగా.. మున్సిపాలిటీకి మాత్రం స్వచ్ఛ మున్సిపాలిటీగా అవార్డు ఇవ్వడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



రోడ్ల బాధ్యత పట్టదా?

ఉండి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. రోడ్ల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. 8లో ▸



స్కూల్ బస్సులపై కేసులు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా మోటారు వాహనాల తనిఖీ అధికారులు బుధవారం విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేసి 18 కేసులు నమోదు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

సీజేఐపై దాడికి న్యాయవాదుల నిరసన



భీమవరంలో న్యాయవాదుల నిరసన దృశ్యం

భీమవరం: సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్), బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడి సభ్య సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. దీనిపై కఠినంగా వ్యవహరించకపోతే ఇలాంటి దాడులు పదే పదే పునరావృతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా, నిత్యం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోర్టు భవనాల సముదాయం నుంచి న్యాయవాదులు ర్యాలీగా అంబేడ్కర్ సెంటర్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లుల శ్రీనివాసరావు, వైవీ ఆనంద్, మోగంటి శివ, డీకెవీ ప్రకాష్, బోకూరి విజయరాజు, గుంటి ప్రభు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఉండి రైల్వే గేటు మూసివేత

ఉండి: రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు మళ్ళీ మొదలుకావడంతో ఈ నెల 10 నుంచి 17 వరకు జాతీయరహదారిపై ఉన్న ఉండి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉండి నుంచి ఆకివీడు వైపు వెళ్ళాల్సిన ప్రయాణికులు పాములపర్రు నుంచి పెదకాపవరం రోడ్డు మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. పాములపర్రు, పెదకావరం రోడ్డు దారుణంగా ఉండటంతో ప్రయాణికులకు మళ్ళీ కష్టాలు తప్పవు. ఆకివీడు వైపుగా వెళ్ళే ప్రయాణికులు ఉండి మసీదు నుంచి వాండ్రం రోడ్డులో ప్రయాణించి వాండ్రం నుంచి పెదపుల్లేరు మీదుగా ఉండిలో జాతీయ రహదారిపైకి చేరుకుని ఆకివీడు వెళ్ళే అవకాశం వుంది. ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్ళేందుకు అవకాశం లేదు

మున్సిపల్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలి



ఏలూరు కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులకు 12వ పీఆర్సీ ప్రకటించాలని, వెంటనే ఐఆర్ ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాల పెంచాలని, పెండింగ్ డీఏలు, సరెండర్ లీవులు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నెర్సు రామారావు ప్రారంభించి మాట్లాడారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రేలంగి నాగరాజు ప్రారంభించి మాట్లాడారు. ఏలూరు మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగిన ధర్నాలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు పాల్గొని తన సంఘీభావం తెలియజేశారు. ఏలూరు ధర్నా కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు.

ఏజెన్సీలో భారీ వర్షం



జల్లేరు జలాశయం నుంచి నీటి విడుదల

బుట్టాయగూడెం: ఏజెన్సీలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ కాసింది. మధ్యాహ్నం తర్వాత మబ్బులు కమ్మి కొద్దిగా వర్షం కురిసింది. రాత్రి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఎగువ వర్షానికి మండలంలోని గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 217.80 కాగా ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రస్తుత నీటి మట్టం 217.05కు చేరుకుంది. దీనితో అధికారులు బుధవారం రాత్రి రెండుగేట్లు సుమారు 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

అభిమాన నేతకు నీరాజనం

- భీమవరంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం
- హెలీప్యాడ్ నుంచి కల్యాణ మండపం వరకూ భారీ జనసందోహం
- భారీ వర్షాన్ని సైతం లెక్కచేయని యువత
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన నేతలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు కుమారుడి వివాహానికి హాజరు



పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కేరింతలు కొడుతున్న అభిమానులు

సాక్షి, భీమవరం: వివాహ వేడుక కోసం జిల్లాకు విచ్చేసిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం నీరాజనం పట్టారు. కుండపోతగా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కాన్వాయ్ వెంట పరుగులు పెట్టారు. అభిమాన నేతను చూసి యువత కేరింతలు కొడుతూ సంబరపడిపోయారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో జరిగిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తనయుడు కృష్ణంరాజు వివాహానికి జగన్ విచ్చేశారు. ఆయన వస్తున్నారన్న విషయం తెలియడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు భీమవరం చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం కల్యాణ వేదికకు సమీపంలోని హెలీప్యాడ్‌కు 3.25 గంటలకు చేరుకుంటారనగా మధ్యాహ్నం నుంచే జువ్వలపాలెం, కన్వెన్షన్ హాలు రోడ్లలో హడావుడి మొదలైంది. మండుటెండను లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు, యువత పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు పట్టుకుని సందడి చేశారు. జగన్ హెలీప్యాడ్‌కు కొద్దిసేపట్లో చేరుకుంటారనే సరికి కారుమబ్బులతో కుండపోత వర్షం మొదలైనా ఎటూ కదలకుండా వేచిచూశారు. అక్కడి నుంచి కల్యాణ వేదిక వరకు కేరింతలు కొడుతూ, జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ కాన్వాయ్ వెంట పరుగులు తీశారు. సాయంత్రం 4 గంటల సమయానికి జగన్ కల్యాణ వేదిక వద్దకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం 5 గంటల సమయానికి హెలీప్యాడ్ నుంచి తిరుగుపయనమయ్యే వరకూ హోరువానలోనూ అధినేత వెంటే ఉండి అభిమానాన్ని చాటుకున్నారు.

కిక్కిరిసిన కన్వెన్షన్

తొలుత హెలీప్యాడ్ వద్ద ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి తరలివచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి జగన్ కన్వెన్షన్ హాలుకు బయలుదేరారు. కల్యాణ వేదిక వద్ద ప్రసాదరాజు, శారదవాణి దంపతులు జగన్‌కు స్వాగతం పలికారు. వధూవరులు కృష్ణంరాజు, దివ్యలను జగన్ ఆశ్వీరించారు. వేదిక వద్ద జగన్‌ను చూసేందుకు జనం పోటీపడ్డారు. ఆయన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యాలను చిన్నాపెద్దా తేడాలేకుండా సోఫాలు, కుర్చీలు ఎక్కి మరీ తమ సెల్‌ఫోన్లలో బంధిస్తూ మురిసిపోయారు.

అధినేతకు ఘన స్వాగతం



జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం (ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నేతలు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద పలువురు నేతలు ఆయన్ను కలిశారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాజ్యసభ్య సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రులు పేర్ని నాని, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఆర్కే రోజా, తానేటి వనిత, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కళ్యాణి, మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాదరావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పీవీఎల్ నరసింహరాజు, చినమిల్లి వెంకట్రాయుడు, గుడాల గోపి, మామిళ్లపల్లి జయప్రకాష్, కంభపాటి విజయరాజు, టి.శ్రీనివాస్‌నాయుడు, పిల్లి సూర్యప్రకాష్, పినిపే శ్రీకాంత్, ఎస్‌ఈసీ సభ్యులు మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, జిల్లా యూత్ ప్రెసిడెంట్ చిగురుపాటి సందీప్, సోషల్ మీడియా కన్వీనర్ బంధన పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, బీవీఆర్ చౌదరి, పేరిచర్ల నరసింహరాజు, ఏఎస్ రాజు, గాదిరాజు రామరాజు, కామన నాగేశ్వరరావు, దాట్ల రంగావతి, ఉమా శంకర్, చవ్వాకుల సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్, మానుకొండ ప్రదీప్, నడపన గోవిందరాజు, ఆనందప్రకాష్, పాలవెల్లి మంగ, హరివర్మ, రమేష్‌వర్మ, జయరామకృష్ణంరాజు, గణేశ్న రాంబాబు, ఆంజనేయరాజు తదితరులు ఉన్నారు.



జగన్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి



జగన్‌ను చూసిన ఉత్సాహంలో అభిమానులు



జగన్‌ను సెల్‌ఫోన్‌లో బంధించేందుకు..



జోరువానలోనూ జగన్ కాన్వాయ్ వెంటే అభిమానులు

మత్స్య సంపద యోజనకు దరఖాస్తు చేసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీఎం మత్స్య సంపద యోజన పథకానికి దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీ రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆక్వా చెరువులు సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి, వెంటనే అప్సడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఆక్వా చెరువులు సాగుదారులు తప్పనిసరిగా అప్సడా కింద నమోదు చేసుకోవాలన్నారు. ఆంధ్ర యువ సంకల్ప్ అంబాసిడర్ డిజిటల్ మారథాన్ కార్యక్రమంలో యువ సంకల్ప్ లఘు చిత్రాల పోటీకి గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, డిజిటల్ ఆవిష్కరణలు, కృత్రిమ మేధా విజ్ఞానాన్ని ప్రోత్సహించడానికి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల ఈవెంట్స్‌ను థీమ్‌గా తీసుకుని 120 సెకండ్ల నిడివి కలిగిన వీడియోలను పోస్ట్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7075230609 నెంబరులో సంప్రదించాలన్నారు.

అక్కడే చెత్త డంపింగ్

నరసాపురం: మున్సిపాలిటీ తీరు మారలేదు. 28వ వార్డులో ఇళ్ల మధ్య ఉన్న మున్సిపల్ స్థలంలో మంగళవారం చెత్తను డంప్ చేయడాన్ని స్థానికులు నిరసించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం కూడా చెత్తను అక్కడే డంప్ చేశారు. మరో వైపు స్థానికులు ఈ అంశంలో తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది. కోర్టు ఎలా స్పందిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

ఏడీఏ నియామకంలో రాజకీయాలు

నూజివీడు: నూజివీడు ఏడీఏగా అదనపు బాధ్యతల విషయంలో రాజకీయాలు చోటుచేసుకోవడంపై వ్యవసాయశాఖ సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ ఏఓకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకుండా ఎక్కడో 50 కి.మీ దూరంలో పనిచేస్తున్న ఏడీఏకు నూజివీడు అదనపు బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల వరకు పనిచేసిన జీ విద్యాసాగర్ సెప్టెంబరు నెలాఖరున పదవీ విరమణ చేశారు. దీంతో నియోజకవర్గంలోని సీనియర్ ఏఓకు ఇన్‌చార్జి ఏడీఏగా బాధ్యతలు అప్పగించాల్సింది పోయి చింతలపూడి ఏడీఏకు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల క్రితం కూడా ఇక్కడి ఏడీఏ సెలవుపై వెళ్లగా అప్పుడు నూజివీడు ఏఓగా పనిచేస్తున్న ఆలూరి చాముండేశ్వరికి ఇన్‌చార్జి ఏడీఏగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం సీనియర్ ఏఓగా ఉన్న ఆగిరిపల్లి వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా చింతలపూడి ఏడీఏకి ఇవ్వడం సమంజసం కాదనే అభిప్రాయం సొంత శాఖలోని ఉద్యోగుల్లోనే వ్యక్తమవుతోంది. చింతలపూడి ఏడీఏకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంలో మంత్రి ఓఎస్‌డీ చక్రం తిప్పినట్లు వ్యవసాయశాఖ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ నెల 6న నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఇన్‌చార్జి ఏడీఏ రాకుండా కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్‌ను పంపగా, నువ్వు ఎందుకు వచ్చావని సబ్‌కలెక్టర్ ప్రశ్నించారు.

కొల్లేరు కేసు 22కు వాయిదా

కైకలూరు: కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలు, జీ రాయితీ, డీ ఫాం భూములు, ప్రజల నష్టపరిహారం అంశాలపై సుప్రీంకోర్టులో వాదనలు బుధవారం జరిగాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందుకు ఇరు పక్షాల న్యాయవాదులు వాదన వినిపించారు. కొల్లేరు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, వివిధ శాఖల నుంచి పూర్తి స్థాయి సమాచారం లేకపోవడంతో కేసును ఈ నెల 22కి వాయిదా వేశారు. కాకినాడకు చెందిన విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి, పర్యావరణవేత్త మృత్యుంజయరావు కొల్లేరు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ) ఈ ఏడాది జూన్‌లో రెండు రోజులు ఏలూరు జిల్లాలో కొల్లేరులో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సీఈసీకి కొల్లేరులో సంబంధిత శాఖల నుంచి పూర్తి సమాచారం రాకపోవడంతో నివేదిక ఆలస్యం అవుతోంది. తదుపరి వాయిదాకు మరింత సమాచారంతో వివిధ శాఖలు సిద్ధం కానున్నాయి.

వేడుకగా శ్రీచక్రస్నానం

- నేటితో ముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- రేపటి నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభం



వైకుంఠ నారాయణుడి అలంకారంలో శ్రీవారు



ధ్వజ అవరోహణం అనంతరం ధ్వజ పటానికి హారతులిస్తున్న అర్చకులు



శ్రీచక్రస్నానం



అశ్వ వాహనంపై క్షేత్ర పురవీధులకు పయనమైన శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు బుధవారం స్వామివారికి శ్రీచక్ర స్నానాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి గ్రామోత్సవాన్ని తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిపారు. ఆ తరువాత ఆలయ యాగశాలలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవమూర్తులను ఒక వేదికపై వేంచేపు చేశారు. పూజాదికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. ఆ తరువాత శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి, హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. సాయంత్రం ఆలయంలో నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజ అవరోహణను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై స్వామి వారి తిరువీధి సేవ అట్టహాసంగా జరిగింది. అలాగే ఆలయ ముఖ మండపంలో శ్రీవారు వైకుంఠ నారాయణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం రాత్రి జరగనున్న శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయని, శుక్రవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

- ఉదయం 8 గంటల నుంచి – భజనలు
- ఉదయం 9 గంటల నుంచి – చూర్ణోత్సవం, వసంతోత్సవం
- ఉదయం 9 గంటల నుంచి – భక్తి రంజని
- ఉదయం 10 గంటల నుంచి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి – నాదస్వరకచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి – హరికథ
- సాయంత్రం 6 గంటల నుంచి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి – ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగము
- ప్రత్యేక అలంకారం : శయన మహావిష్ణువు

క్లుప్తంగా

పారా త్రోబాల్ జట్టు మేనేజర్‌గా సూర్యనారాయణ


సూర్యనారాయణ

అత్తిలి: ఈఏడాది డిసెంబర్ 15 నుండి 22 వరకు శ్రీలంక లో రత్నాపుర ఇండోర్ స్టేడియంలో మొదటి సౌత్ ఏషియన్ పారాత్రో బాల్ ఛాంపియన్ షిప్–2025 లో పాల్గొనే భారత పారా త్రో బాల్ జట్టు మేనేజర్‌గా అత్తిలికి చెందిన యడ్లపల్లి సూర్యనారాయణ ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ పారాత్రో బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గండా కై లాష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఆగస్టు 30, 31 తేదీల్లో కోయంబత్తూర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్న ఆంధ్ర పారా త్రో బాల్ జట్టుకి మేనేజర్‌గా సూర్యనారాయణ వ్యవహరించారని తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్ర పారాత్రో బాల్ జట్టు విజేతగా నిలిచిందని కైలాష్ పేర్కొన్నారు.

మద్ది అంజన్న హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షణలో కేవీబీ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది హుండీలను తెరిచి లెక్కింపు నిర్వహించారు. 111 రోజులకు గానూ దేవస్థానంలోని హుండీల ద్వారా రూ.60,84,458, అన్నదానం హుండీ ద్వారా రూ.76,609లు మొత్తం రూ.61,61,067 ఆదాయం సమకూరినట్లు మద్ది ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

రేపు జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శుక్రవారం అండర్ 14, అండర్ 17 బాల బాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్–14, 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు, కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అండర్– 14,17 బాల బాలికలకు రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 90308 94311 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఇదేనా.. స్వచ్ఛ మున్సిపాలిటీ?

- భీమవరంలో ఎక్కడి చెత్త అక్కడే
- అయినా స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు
- ఆశ్చర్యపోతున్న పట్టణవాసులు


ఆర్టీసీ డిపో వెనుక రోడ్డులోని డ్రెయిన్ దుస్థితి


మెంటేవారితోటలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర అవార్డుల్లో జిల్లా స్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీగా భీమవరం మున్సిపాలిటీ అవార్డు అందుకోవడంపై భీమవరం ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మా కాలనీల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది..చెత్త తీయండి మహాప్రభో అని నేరుగా మున్సిపాలిటీకి మహిళలు సైతం వెళ్లి గగ్గోలు పెట్టే పరిస్థితి ఉన్నా మున్సిపాలిటీకి మాత్రం స్వచ్ఛ మున్సిపాలిటీగా అవార్డు ఇవ్వడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6న కలెక్టరేట్ వద్ద కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదగా స్వచ్ఛ మున్సిపాలిటీగా భీమవరం మున్సిపాలిటీకి అవార్డు అందుకున్నారు. పట్టణంలో మధ్యాహ్నం 1 గంట వరకు చెత్త తీయరని, కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి చెత్త తీస్తారని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని డ్రెయిన్లన్నీ చెత్తచెదారంతో అధ్వానంగా ఉన్నా అవార్డు రావడం ఏంటి? అని ప్రశ్నిస్తున్నారు.

39 వార్డుల్లోనూ పారిశుధ్యం అధ్వానం

భీమవరం మున్సిపాలిటీలో 39 వార్డులు ఉన్నాయి. దాదాపు ప్రతి వార్డులో చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడ ఉంటుంది. డ్రెయిన్లలో కూడా చెత్తాచెదారం పేరుకుపోయి డ్రెయినేజి నీళ్లు రోడ్డుపై ప్రవహించే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భీమవరంలో ఒక డ్రెయినేజీను కూడా బాగు చేయడం గానీ, ఎత్తు పెంచి నిర్మించడం గానీ చేయలేదు. ముఖ్యంగా పట్టణంలో చెత్తతో, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నూటికి నూరు శాతం తొలగింపు ఎక్కడ?

భీమవరం పట్టణంలో మొత్తం 38,744 కుటుంబాలు ఉండగా 1.50 లక్షల మంది జనాభా ఉన్నారు. రోజుకు 70 టన్నుల చెత్త వస్తుందని అంచనా. అయితే మున్సిపాలిటీ మాత్రం 60 నుంచి 70 శాతం మేర చెత్తను డంప్ చేస్తుంది. నూటికి నూరుశాతం చెత్తను తొలగించడం లేదు. దాంతో మారుమూల ప్రాంతాల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. అలాంటి మున్సిపాలిటీకి ఏ విధంగా కూటమి ప్రభుత్వంలో అధికారులు స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు ఇప్పించారో? వారికే తెలియాలని పట్టణవాసులు ఎద్దేవా చేస్తున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియదా?

భీమవరం మున్సిపాలిటీకి స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు అందించిన జిల్లా కలెక్టర్, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజుశ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అంజిబాబుకు భీమవరం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం ఏ స్థాయిలో ఉంటుందో? వారికి తెలియదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాక్షాత్తూ కలెక్టర్ కలెక్టరేట్‌కు వచ్చే దారిలో అంటే పీపీ రోడ్డులో డ్రెయిన్లు ఏ స్థాయిలో ఉన్నాయో? ఆమెకు తెలియదా? అని మండిపడుతున్నారు. ఎమ్మెల్యే అంజిబాబు నివాసం ఉండే బ్యాంకు కాలనీలో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయని, పలు వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని చెబుతున్నారు. ఇక కేంద్రమంత్రి ఉండే నాలుగో వార్డు, ఆర్టీసీ డిపో, దగ్గరలో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో డ్రెయిన్‌లు అధ్వానంగా ఉండడంతో పారిశుద్ధ్యం దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

ఎట్టకేలకు కల్వర్టుపై గుంతల పూడ్చివేత


కల్వర్టుపై గుంతలు పూడ్చిన దృశ్యం

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: మండలంలోని నూగొండపల్లి వద్ద ఉన్న కుంపిని వాగు పై ఉన్న కల్వర్టు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. ఈ దుస్థితిపై సోమవారం సాక్షి దినపత్రికలో 'ప్రమాదకరంగా కల్వర్టు' కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు కల్వర్టుపై ఏర్పడిన గుంతులను బుధవారం కంకరరాళ్లతో పూడ్పించారు.

రేపటి నుంచి నిట్‌లో టెక్రియా 2కే25


నిట్‌లో టెక్రియా 2కే25 సన్నాహక కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో టెక్రియా 2కే25 సన్నాహక కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. శుక్రవారం, శనివారాల్లో రెండు రోజుల పాటు టెక్రియా జరుగనుంది. బుధవారం కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అసోసియేట్ డీన్ రాజేశ్వర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సారధ్యంలో విద్యార్థులు నృత్యాలు చేశారు. టెక్రియాలో రోబోటిక్స్, ఆటోమేషన్, అల్టిమేట్ డ్రోన్, డ్రోన్ చాలెంజ్, సెరెనిటీ రూమ్, ఇంజనీర్స్ డ్రైవ్ వే , రిథమ్ రియాల్టీ, షేర్ లాక్, షార్ట్‌ఫిలిం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నిట్ అధికారులు కె.హిమబిందు, శ్రీనివాసన్, టి.రమేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక


వాలీబాల్ అండర్-19 జిల్లా జట్టు


కబడ్డీ అండర్-19 జిల్లా జట్టు

పెదవేగి: ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్ల ఎంపికలు బుధవారం లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, కోకో, త్రోబాల్, బాల్‌బాట్‌మింటన్, చెస్, యోగాసన, మొదలైన ఆటల పోటీలు నిర్వహించి, జిల్లా జట్లను ఎంపిక చేశారు. సుమారు 480 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రిన్సిపాల్ ఏవీ శివప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.జయరాజు, హేళాపురి ఇంజనీరింగ్ కళాశాల ఏఓ కరుణానిధి, పీడీలు రాజా, శ్రీనివాస్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

12న దక్షిణ భారత ఓబీసీ సెమినార్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మధురానగర్ (విజయవాడసెంట్రల్): సౌత్ ఇండియా ఓబీసీ సెమినార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురవ సంఘం పదో వార్షికోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు తట్టి అర్జునరావు, అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. విజయవాడ దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురవ సంఘం ఆధ్వర్యంలో సంఘ పదో వార్షికోత్సవం, సౌత్‌ఇండియా ఓబీసీ సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెమినార్‌కు రాజకీయాలకు అతీతంగా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖ నేతలు హాజరుకానున్నట్లు చెప్పారు. షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ నార్త్ నుంచి 6 రాష్ట్రాలు, సౌత్ నుంచి 6 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం తట్టి అర్జునరావు ఎన్నికల అధికారిగా ఆయన పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పూర్వ పోలీసు అధికారుల సేవలు అభినందనీయం


అమరులైన పోలీసు అధికారులకు నివాళులర్పిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పూర్వ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమనీ సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవకే అంకితమై పారదర్శకంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ఏడో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథులుగా మాజీ డీజీపీలు మాలకొండయ్య, పి.గౌతంకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాజీ అదనపు ఎస్పీ కె.మాణిక్యాలరావు (80), డిప్యూటీ ఇంజనీర్ చందన విష్ణువర్ధన్ (85), మాజీ పోలీస్ కానిస్టేబుల్(86), సయ్యద్ బాజీ (85)ను ఘనంగా సత్కరించారు. అనంతరం అమీనాపేట సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్లోని 12 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పీవీఎస్‌కే భగవాన్ రాజు, సంఘం కార్యదర్శి మాజీ సీఐ ఎస్.దాశరధి, ట్రెజరర్ ఎల్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కె.రాజగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో మాజీ సర్పంచ్ కర్రి కమల ఇంట్లో సెప్టెంబర్ 16న జరిగిన దోపిడీకి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.35 లక్షలు విలువచేసే 324.540 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ తెలిపారు. పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 16న రాత్రి 7:45 ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియ వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి తన అత్తగారిని, తనను తాళ్లతో బంధించి తన మెడపై కత్తి పెట్టి చంపుతామని బెదిరించి ఇంట్లో ఉన్న రూ.35 లక్షలు విలువైన బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు, రెండు రెండుసెల్ ఫోన్‌లను చోరీ చేశారని కర్రి జ్ఞాన చంద్రిక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేశామని వివరించారు. దర్యాప్తులో ఈ దోపిడికి సూత్రదారి అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన వెలగల నరేందర్ రెడ్డిని గుర్తించామన్నారు. దోపిడీకి పాల్పడిన వారిని అల్లూరి సీతారామరాజు జిల్లా తులం గ్రామానికి చెందిన తెరవాడ హనుమంతరావు, నంద్యాల జిల్లా తువ్వ పల్లి గ్రామానికి చెందిన చింతల సుధాకర్‌గా గుర్తించామన్నారు. ఈ ముగ్గురిని నత్త రామేశ్వరం సెంటర్లో ఆభరణాలతో సహా పట్టుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. సమావేశంలో పెనుమంట్ర ఎస్సై కె.స్వామి, ఆచంట ఎస్సై కె.వెంకటరమణ, భీమవరం సైబర్ క్రైమ్ ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు


జీజీహెచ్‌లో గదులను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని పలు విభాగాలను డాగ్‌స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. జీజీహెచ్‌లోని అత్యవసర సేవల విభాగం వైపు నుంచీ లోపల ఎమర్జెన్సీ వార్డులు, ఇతర విభాగాల్లోనూ తనిఖీలు చేశారు. జీజీహెచ్ ప్రాంగణంలోనూ, అన్ని విభాగాల్లోనూ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దీనిపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే ఏలూరు జీజీహెచ్‌లోనూ డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టామని తెలిపారు.

విద్యాసంస్థల బస్సులపై 18 కేసులు


బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లావ్యాప్తంగా మోటారు వాహనాల తనిఖీ అధికారులు బుధవారం విద్యా సంస్థల బస్సులను తనిఖీలు చేశారని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. ఈ తనిఖీల్లో వివిధ ఉల్లంఘనలకు గాను 18 కేసులు నమోదు చేసి, రూ.78,230 అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యా సంస్థల బస్సులు కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థలు కచ్చితంగా నిబంధనలను పాటించాలని, లేకపోతే బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్ల నిర్వహణ బాధ్యత ప్రజలదేనా..?


కోలమూరులో రోడ్డుపై స్థానికులు ఏర్పాటు చేసిన హెచ్చరిక జెండాలు


రహదారి పంట బోదెలోకి కుంగిపోవడంతో బాగు చేయిస్తున్న స్థానికులు


- ఉండి–గణపవరం రోడ్డు అధ్వానం
- గుంతలు సరి చేసి.. సూచికలు ఏర్పాటు చేస్తున్న ప్రజలు

ఉండి: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. జాతీయ రహదారి 165తో పాటు రాష్ట్ర రహదారులు, ఆర్‌అండ్‌బీ, ఇంటర్నల్‌రోడ్ల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఉండి–గణపవరం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని చెబుతున్నారు. ఉండి నుంచి పాములపర్రు, వెలివర్రు, కోలమూరు, ఉప్పులూరు, పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల గ్రామాలకు చెందిన ప్రజలు ఇదే రోడ్డుపై ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ రోడ్డు పేరుకే రాష్ట్ర రహదారి అని, కానీ ఈ రోడ్డు నిర్వహణను ఆర్‌అండ్‌బీ అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుకు ఓ వైపు బొండాడ మేజర్ డ్రెయిన్ ఉంది. అయితే ఈ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం, నాణ్యత లేకపోవడం వల్ల రోడ్డు వేసినా లేక మరమ్మతులు చేసిన కొద్దిరోజులకే మళ్లీ పరిస్థితి మొదటికి వస్తుంది.

ఆ బాధ్యత తీసుకున్న ప్రజలు

ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు కోలమూరులో రోడ్డుపైనే ఇసుకబస్తాలు పెట్టి వాటిల్లో కర్రలు పెట్టి వాటికి ఎర్రని బట్టలు చుట్టి ప్రయాణికుల ప్రాణాలు కాపాడుతూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. అలాగే కోలమూరు గ్రామ పరిధిలో రోడ్డుకు ఆనుకుని వుండే పంటబోదె ఆక్రమణకు గురైందంటూ గతంలో తవ్వేశారు. అయితే రోడ్డుకు ఆనుకుని బోదె తవ్వడంతో ఇప్పుడు రోడ్డు బోదెలోకి కుంగిపోతుంది. కొద్దిరోజుల క్రితం ఓ ద్విచక్రవాహనదారుడు కుంగిన రోడ్డు గుంతలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో స్థానికంగా ఉండే రైతులు తమ పని ముగిసిన తరువాత పొక్లెయినర్ సాయంతో ఈ రహదారికి మరమ్మతులు చేయించారు. ఉండి నుంచి తాడేపల్లిగూడెం , జంగారెడ్డిగూడెం, అలాగే తాడేపల్లిగూడెంలో జాతీయ రహదారి నుంచి విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఎక్కువగా ఈ రహదారినే వినియోగిస్తూ ఉంటారు. ఇంతటి ప్రముఖమైన ఈ రోడ్డును అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.


ఆదమరిస్తే అంతే..



ఉండి గణపవరం రోడ్డు అంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి వచ్చింది.రోడ్డు పరిస్థితిని గమనించి మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోడ్డు దారుణంగా మారింది. దీనివల్ల వారానికి ఒకటి లేదా రెండు పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వర్రే పైడియ్య, మాజీ ఎంపీటీసీ, పాములపర్రు

బాధ్యత ఎవరిది?



రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికుల బాధ్యత ఎవరిది? వారిని ఎవరు పట్టించుకోవాలి? ఈ రోడ్డు దారుణంగా ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి వారు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మరణాలకు బాధ్యత ఎవరిది? – నిమ్మల కేశవకుమార్,ఎంపీటీసీ ఉప్పులూరు

క్లుప్తంగా

గర్భిణులకు సీమంతాలు



గర్భిణులకు పండ్లు ఇస్తున్న డాక్టర్ ఆనంద్

తణుకు అర్బన్: మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్‌పై పైడిపర్రులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు మానసిక వైద్యులు డాక్టర్ కుడారి ఆనంద్ అవగాహన కల్పించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్ డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ వంక రాజకుమారి సౌజన్యంతో 30 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీడీపీవో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, మాజీ గవర్నరర్ మాదిరెడ్డి బాబూజీ రావు, ఫ్యామిలీ కౌన్సెలర్ కుడారి సజిని, డాక్టర్ వసుంధర, జవ్వాది తమ్మయ్యనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



తణుకులో పేద మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సినీ డైరెక్టర్ దాసరి మారుతి జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం, వస్త్రదానం చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ కారుమంచి యోహాన్ తెలిపారు. తణుకు శివారులోని కంపోస్టు యార్డులో నివసిస్తున్న పేదల మధ్య కేకు కట్‌చేసి ఆహార ప్యాకెట్లు, చీరలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లిపూడి సన్నీ, ఉండ్రాజవరపు చరణ్, కారుమంచి ప్రవీణ్ పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకులో దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందచేస్తున్న మానవత సభ్యులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు తెలిపారు. తణుకు మహాలక్ష్మి జ్యూయలర్స్ యజమాని బొండాడ నాగేశ్వరరావు, పద్మ శేషారత్నం దంపతుల కుమారుడు బొండాడ జయప్రకాష్ ఆర్థిక సాయంతో తణుకు బొమ్మలవీధిలో నివసిస్తున్న దివ్యాంగురాలు కుమిలి దేవి వెంకట సత్యవతికి బుధవారం వారి నివాసానికి వెళ్లి వీల్‌చైర్ అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి కతారి విశ్వనాథరాజు, నాయకులు నెక్కంటి నాగేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు, కొల్లేపర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు



బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, రిసోర్స్‌పర్సన్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర సమరయోధుడు, రచయిత, కళాకారుడు అడివి బాపిరాజు అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం బాపిరాజు 130వ జయంతి ఘనంగా నిర్వహించారు. బాపిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్లు గరికిపాటి బాపయ్యశర్మ, ఏవీ లక్ష్మణరావు, వి.రామాంజనేయులు, వి.జాన్ బాబులు మాట్లాడుతూ బాపిరాజు సినీరంగంలో దర్శకత్వం చేశారని, నవలలు రచించారని తదితర జీవిత విషయాలను చదవరులకు వెల్లడించారు.

మాధవరంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జీఎస్టీ రాయితీపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వ హించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, కార్యదర్శి బి.ఫణికుమార్, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర పరిసరాలతో పట్టణం అస్తవ్యస్తం

- మురుగు కూపంలో ఖాళీ స్థలాలు
- డ్రెయిన్‌ల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఎక్కడి చెత్త అక్కడే
- దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు



ఖాళీ స్థలాలు, చెత్త చెదారాలు



డ్రెయిన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు



డ్రెయిన్‌లో కొబ్బరి బొండాలు, వ్యర్థాలు



డంపర్ బిన్నులు వద్ద వ్యర్థాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఖాళీ స్థలాలు, నీటి నిల్వలు ఉన్న అన్ని ప్రాంతాలు దోమలకు అవాసాలుగా మారాయి. దీంతో దోమల బెడద అధికమైంది. నేడు పట్టణంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి.

వ్యాధులు ప్రబలే సీజన్లు

కాసేపు ఎండ, కాసేపు వర్షం, మరోప్రక్క వర్షకాలం నుంచి శీతాకాలంవైపు వెళ్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే సీజన్లుగా మారుతున్నాయి. అధిక తేమ, నిలిచిపోయిన నీరు, తేమతో కూడిన పరిస్థితులు ఉండటంతో ముఖ్యంగా బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంద్రాలు వ్యాధులను మోసే కీటకాలకు సంతానోత్పత్తికి అనువైన స్థావరాలుగా ఖాళీ స్థలాలు, నిల్వనీటితో ఉన్న వనరులు మారాయి. లక్ష పైగా ఉన్నా జనాభా అప్రమత్తంగా లేకపోతే ఆసుపత్రి పాలు అవ్వాల్సిందేనని గణాంకాలు చెబుతున్నాయి.

మునిసిపాలిటీ దృష్టి సారించాలి

పారిశుద్ధ్య నిర్వాహణ భారాన్ని వహించాల్సిన మునిసిపాలిటీ కాలానుగుణంగా దోమల నివారణ చర్యలపై దృష్టి సారించడం లేదు. ఆయిల్ బాల్స్ డ్రెయిన్‌లలో వేయడం లేదు. గంబూషియా చేపలు వదలడంలేదు. ఫాగింగ్ కానరావడం లేదు. డ్రెయిన్‌లో స్ప్రేయింగ్ చేయడంలేదు. ప్రైవేట్ స్థలాలు పొదలుగా మారిన ఎటువంటి చర్యలు లేవు. దీంతో ప్రజలకు దోమల హింస తప్పడం లేదు.

పట్టణంలో 35 వార్డులలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలు

పట్టణంలో ఉన్న 35 వార్డులలో ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రెయిన్‌ల్లో పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, కొబ్బరి బొండాలు, ఇతర చెత్త చెదారాలు వల్ల దోమల ఉత్పత్తికి కేరాఫ్‌గా డ్రెయిన్‌లు, ఖాళీ స్థలాలు మారుతున్నాయి. అదే విధంగా చెత్తా చెదారాలు ఎక్కడ బడితే అక్కడ కానవస్తున్నాయి. అదే విధంగా ఖాళీ స్థలాలను శుభ్రం చేయడం లేదు. డ్రెయిన్‌లు కనీసం రోజువిడిచి రోజు తీయడం లేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చెత్త చెదారాలు వేసే పాయింట్లు వద్ద దుర్వాసన ప్రబలుతుంది. చెత్త చెదారాలు తీయడంలో ఆలస్యమైతే వీధి కుక్కలు కారణంగా చెత్త చెదారాలను రోడ్లపైనే ఉంచుతున్నాయి. వీటిని తుడిచేందుకు పారిశుధ్య సిబ్బంది ముందుకు రావడం లేదు. ఎక్కడపడితే అక్కడ ఆపారిశుద్ధ్య పరిస్థితులు కాన వస్తున్నాయి. నిషేధిత క్యారీ బ్యాగ్‌లను కంట్రోల్ చేయడం లేదు. దీంతో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కానవస్తున్నాయి. వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి.

అప్రమత్తత ఎంతో అవసరం

బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు వల్ల టైఫాయిడ్, కలరా, కామెర్లు, అతిసారం, గ్యాస్ట్రో ఎంటెరిటిస్, వైరల్ ఫీవర్లు, తదితర వ్యాధులు రావడంతో ప్రజలు ఇక్కట్లు పడతారు.

గాలి ద్వారా వచ్చే వ్యాధులు

వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు హెచ్చు తగ్గులు ఉండటంతో పెరిగిన తేమ కారణంగా శ్వాస కోశ వ్యాధులతో పాటు అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. జలుబు, ఫ్లూ, వైరల్ జ్వరాలు రావడంతో పాటు తేమ, తడి వాతావరణం కారణంగా ఫంగల్ బ్యాక్టీరియా కారణంగా చర్మ వ్యాధులు వస్తాయి. గజ్జి, తామర, చర్మంపై పుండ్లు, వాపులు, ఎర్రటి గడ్డలు, చీమి పొక్కులు వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు తప్పక అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు పాటించాలి.

ఆహార నియమాలు తప్పక పాటించాలి

వీధి ఆహారంనకు దూరంగా ఉంటూ ఆహార నియమాలు పాటించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెంచేందుకు అవసరమైన పోషక విలువలతో ఉన్న తాజా ఆహారం, తాజా పండ్లు, తాజా కూరగాయలు తీసుకోవడం వల్ల చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి. సురక్షితమైన నీటిని తాగాలి.

దోమల నియంత్రణ ఎంతో అవసరం

దోమల సంతానోత్పత్తి పెరిగిపోతుంది. నియంత్రణ ఎంతో అవసరం పరిసరాలలో, ఇంటిలోను నీటి నిల్వలు లేకుండా చూడటం, రక్షణ దుస్తులు ధరించాలి. దోమ నివారణకు మందులు వాడటం ఎంతో అవసరం, దోమ తెరలు వాడాలి. పారిశుద్ధ్య అధికారులు స్పందించి దోమల ఉత్పత్తి పెరగకుండాఆపారిశుద్ధ్య పరిస్థితులను తొలగించాలి.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



పట్టణంలో దోమల బెడద పెరుగుతుంది. డ్రెయిన్‌లు, ఖాళీ స్థలాలు, నిల్వ నీరు ఉన్న ఆయా ప్రాంతాలలో తప్పక పొడి వాతావరణ తీసుకురావాలి. ముఖ్యంగా ప్లాస్టిక్ నిరోధానికి కృషి చేయాలి. డ్రెయిన్‌లలో స్ప్రేయింగ్, నిల్వ నీటి ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వదలడం చేయాలి. అపారిశుద్ధ్య పరిస్థితులను తప్పక తొలగించాలి. వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలి.

– మండల నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి

రాజశేఖర్‌కు సత్కారం



బంగారుగూడెం అరుంధతీపేటలో రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం అరుంధతీ పేటలో మంగళవారం రాత్రి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు కొల్లి రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడు తూ ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి రాజశేఖర్ కృషి చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సామాజికవర్గ ప్రజలంతా కలిసికట్టుగా ఉండి ఐక్యతను చాటుకోవాలన్నారు. తద్వారా సమస్యల పరిష్కారం సుగమం అవుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నెల్లూరు శ్రీనివాస్, కొడవటి రాజేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కండెల్లి రాజేష్, దూలపల్లి ఆనంద్, పెంటపాడు ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాతకాకుల నాగరాజు, ఉలంపర్తి ఏసేపు, పోలిపో అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహానాగు చిత్రం షూటింగ్ ప్రారంభం

పెంటపాడు: దైనందిన జీవితంలో దైవభక్తి ప్రాశస్త్యాన్ని వివరించే మహానాగు చిత్రం షూటింగ్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో నూతన చిత్రమైన మహానాగు చిత్రం షూటింగ్ ప్రారంబోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహూర్తం క్లాప్ కొట్టి ఎమ్మెల్యే చిత్రయూనిట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తొలుత ఉమారామలింగేశ్వరస్వామి, శ్రీకృష్ణాశ్రమం తదితర ప్రాంతాలలో షూటింగ్ కోసం యూనిట్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నూతన నటీనటులతో నిర్మించబోయే ఈ చిత్రం వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న కరిబండి రామకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని లయన్స్ కరిబండి రామకృష్ణ అన్నారు. అలాగే నడక, వ్యాయామలు తప్పనిసరి చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు సహకారంతో బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. లయన్స్ ఇంద్రవాణి అధ్యక్షత వహించారు. విద్యార్థులచే ధాన్యం చేయించారు. యోగాసనాలు వేయించారు. వక్తలు మాట్లాడుతూ కౌమరదశలో వచ్చే మార్పులు, మానసిక ఆరోగ్యం, చదువులు, భవిష్యత్తు కోసం ముందుస్తుగా పునాది, భాగోద్వేగాలు అర్థం చేసుకోవడం తదితర విషయాలపై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో కె.రామకృష్ణ, శశికళ, రత్నకుమారి, కృష్ణంరాజు, మాధవి, కారుణ్య సరస్వతి, కొత్త సుభద్ర, మాధురి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న భాస్కర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని న్యూరో సైకియాట్రిస్ట్ వైద్యులు పృథ్వీరాజ్, రాజా స్నేహిత, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సర్వీస్ చైర్‌పర్సన్ పెదప్రోలు వెంకటాచార్యులు (భాస్కర్) అన్నారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, వ్యసనాల నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. క్లబ్ ఉపాధ్యక్షుడు కేతల మణికంఠ, సెక్రటరీ అడ్డు రంజిత్, ట్రెజరర్ అప్పన రమేష్ కుమార్, డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్, ఎస్‌వీ రమణరావు, వట్టిప్రోలు రాము, ప్రిన్సిపాల్ రామకృష్ణ, రాజా త్రినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తల ఆందోళన



పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది నిరసన చేస్తున్న దృశ్యం

పెంటపాడు: గత కొంతకాలంగా తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం ప్రభుత్వ వైద్యులు నిరసన చేస్తున్న విషయం విధితమే. పలు ప్రాంతాల్లో వివిధ రూపాలలో ధర్నా చేస్తున్న డాక్టర్లుకు మద్ధతులగా కిందస్థాయి సిబ్బంది సంఘీభావం తెలుపుతున్నారు. తాజాగా పెంటపాడులో ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది, మొత్తం కలిసి నిరసన తెలుపుతూ డాక్టర్ల కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: వాట్సాప్ షెడ్యూల్ ద్వారా రైతులు నేరుగా ఎన్ని బస్తాలు అమ్ముకోవాలనుకుంటున్నారో అన్ని బస్తాలనే షెడ్యూల్ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం పోడూరు మండలంలో వాస్తా, డీఏ, కస్టోడియన్ ఆఫీసర్, సొసైటీస్ సిబ్బందికి ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యం ధర క్వింటాల్ సాధారణ రకానికి రూ.2369, గ్రేడ్ ఏ రకానికి రూ.2389 నిర్ధారించారని తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎం విశ్వాసరావు, ఎంఎల్‌వో బీవీ శేషుబాబు, డీటీ కేవీవీ సత్యనారాయణ, ఆర్రై రంబాబు, ఏఈఓ వి.చిరంజీవి పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: నేడు ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని డాక్టర్ నితిన్ రిమ్మలపూడి అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో రాజమండ్రి డెల్టా హాస్పటల్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీపై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డాక్టర్ నితిన్ మాట్లాడారు. అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీ ద్వారా హెర్నియా, గర్భాశయ, బీరయాట్రిక్, గాలిబ్లాడర్ మేజర్ అపరేషన్లు అతి తక్కువ నొప్పితో, అతి తక్కువ ఖర్చుతో చేయవచ్చని వివరించారు. షుగర్ వ్యాధికి శాశ్వత ఆపరేషనలు, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్స్ మండవ సుమంత్, ఆర్ క్రాంతి కుమార్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేదారీఘాట్‌లో ఆలయాల పరిశీలన



కేదారీ ఘాట్‌లో ఆలయాలను పరిశీలిస్తున్న డెప్యూటీ కమిషనర్ రమేష్ బాబు

పెనుగొండ: వశిష్టా గోదావరి పరివాహక ప్రాంతం సిద్ధాంతం కేదారీఘాట్‌లో రాబోయే పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లుపై దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ డీఎల్వీ రమే ష్ బాబు బుధవారం పరిశీలించారు. ఆలయా ల సుందరీకరణ, పుష్కరాలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన సదుపా యాలు, ఇతర అంశాలపై స్థానికులతో చర్చించారు. ఆలయాలు ఎత్తు పెంచాలని, సత్రంచు ట్టూ ప్రహరీ నిర్మించా లని స్థానికులు సూచించారు. డీఈ శ్రీనివాసరావు, డీఈఓ హరి సూర్యప్రకాష్, బొబ్బిలి శ్రీను, కట్టా చిన శ్రీను, కడలి సత్యనారాయణ, కౌరు శ్రీరామమూర్తి, చింతపల్లి జేమ్స్, లక్కువర్మ, తానేటి మదన్, బడేటి గణేష్, కుక్కల రామకృష్ణ, ఊటాల మురళి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం



మార్టేరులోని ఆచంట రోడ్డులో బస్సు కోసం వేసి ఉన్న మహిళా ప్రయాణికులు

పెనుమంట్ర: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బుధవారం అన్ని రూట్లలోనూ బస్సులు నిండిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి బస్సులు సంఖ్య పెంచకపోవడం వల్ల ప్రయాణికుల చావుకు వచ్చిందని మహిళలు, వృద్ధులు కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. గురువారం అట్లతద్ది సందర్భంగా వివిధ సరుకులు కొనుగోలు చేయడానికి గ్రామీణ మహిళలు పట్నాలకు వెళ్లడం, తద్దులు తీర్చుకోవడానికి కోడళ్లు, బంధువులు పుట్టిళ్లకు ప్రయాణం కావడంతో బుధవారం బస్సుల్లో రద్దీ ఎక్కువైందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

సాగులో ఆదాయం పెంచుకోవాలి



రామన్నపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త రమణ

పెనుగొండ: సాగులో రైతన్నలకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు చేస్తున్నటుట్లు మార్టేరు వరి పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ రమణ అన్నారు. బుధవారం ఐఎఫ్‌ఎస్ క్లస్టర్ సిద్ధాంతం, నడిపూడి, రామన్నపాలెంలకు చెందిన మహిళా రైతులకు అవగాహన సదస్సు రామన్నపాలెంలో నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ, అనుబంధ ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చునని, పంటల సస్య రక్షణకు అవసరమై న మందులు వాడాలని రమణ సూచించారు. పంటలకు నష్టం కలిగించే ఎలుకల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళా రైతుల ఆర్థిక బలోపేతానికి ప్రతి 100 కుటుంబాలకు సీఆర్‌పీలను నియమించి, వారివారి అభీష్టం మేరకు వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్ విషయాలపై అధునాతన టెక్నాలజీ అందించడమే ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపీటీసీ కృష్ణకాంత్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ సభ్యుడు సుబ్బరాజు, గంద్రోతు నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్, శాస్త్రవేత్తలు డాక్టర్ నామాల శ్రీనివాస్, డాక్టర్ భువనేశ్వరి, ఏఓ పి స్పందన, కుసుమకుమారి, పుష్పావతి, పార్వతిలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో రమేష్

అత్తిలి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని భీమవరం డివిజన్ డీవైఈఓ ఎస్ రమేష్ అన్నారు. బుధవారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో అథ్లెటిక్స్, చెస్, కబడ్డీ, కోకో, షటిల్, వాలీబాల్, యోగా పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు తణుకు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని ఆయన చెప్పారు. గురువారం బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాద్, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ ఎస్ దిలీప్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

అత్తిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు అత్తిలి మండలం లక్ష్మినారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎం హర్షిత దుర్గ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సుబ్బరాజు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన పోటీలలో హర్షిత దుర్గ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి దుర్గను, పీఈటి సురేష్‌ను, గ్రామ సర్పంచ్ పి నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు, అభినందించారు.

ప్రత్తిపాడులో స్కూల్‌గేమ్స్ పోటీలు

పెంటపాడు: మండలంలోని ప్రతిపాడు సెంట్‌మెరీస్ స్కూల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఎంపికపోటీలు బుధవారం ఎంఈవో టీవీరామకృష్ణ, స్కూలు ఫాథర్ అమల్‌రాజ్‌లు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. పలు ప్రదేశాల నుంచి హాజరైన విద్యార్థుల నుంచి అండర్-14(బాల,బాలికలు), చెస్, కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, యోగా, అండర్-17(బాలబాలికలు)ను టీం సభ్యులు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం. శ్రీనివాస్, పోటీల ఇన్‌చార్జి శేఖర్‌బాబు, ఫాథర్ ఆరోగ్యరాజ్, పీడీలు ఎస్. సాయి రెడ్డి, యోహాను, ఎన్. సత్యనారాయణ, వైశాలి, కమలమ్మ, పోశియ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తూర్పువిప్పర్రు విద్యార్థులు

ఇరగవరం: వీరవాసరం పాఠశాలలో జరిగిన జిల్లా ఫెన్సింగ్ పోటీల్లో ఎఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు 12మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఉషశ్రీ, సర్పంచ్ ఆకేటి నరసింహరావులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో మక్కువ చూపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం



ప్రత్తిపాడు సెంట్‌మేరీస్‌స్కూల్లో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ పోటీల్లో వాలీబాల్ టీంకు ఎంపికైన ఆటగాళ్లు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం